నేడు అన్నదాత పోరు

- గూడూరు, సూళ్లూరుపేటలో ర్యాలీకి సిద్ధమవుతున్న రైతులు
- సబ్‌కలెక్టర్, ఆర్డీవోకు వినతి పత్రాలు అందజేయనున్న నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను నిలువునా దగా చేస్తోందని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి నిప్పులు చెరిగారు. గూడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు, రైతులతో కలసి మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరుపై సమీక్ష నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కరువు కూడా వస్తుందని అందుకే చంద్రబాబు, అతివృష్టి, అనావృష్టి కవల పిల్లలని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో రైతులు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. వరి సాగు చేయవద్దని ఒక సీఎం చెప్పడం చూస్తుంటే అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్లో ఉన్నామా.. లేక పంజాబ్‌లో ఉన్నామా అని ప్రశ్నించారు. నేడు పలు ప్రాంతాల్లో రైతులు పండించే ఉల్లి, టమాటా, మిర్చి, పొగాకు, మామిడి, నిమ్మ ధరలు పతనం అయ్యాయని దుయ్యబట్టారు. ఈ క్రమంలోనే మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు బాసటగా ఉండేలా రైతులను కలుపుకుని అన్నదాత పోరును మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా డివిజన్ల పరిధిలో నిర్వహించాలని ఆదేశించారని అన్నారు. దీంతో గూడూరు డివిజన కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టేందుకు గూడూరు, వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు కదలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ, రూరల్, కోట మండలాల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, ఎం.విజయకుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డితో పాటుగా గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, సైదాపురం మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపుమేరకు మంగళవారం చేపడుతున్న పోరుబాటతో కూటమి అవినీతి కూసాలు కదలాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు.

చిట్టమూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం గూడూరులో జరిగే అన్నదాత పోరుకు చిట్టమూరు మండలంలోని పార్టీ శ్రేణులు, రైతులు ఉదయం 9 గంటలకు టవర్ క్లాక్ సెంటరుకు చేరుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు.



పోస్టర్ల ఆవిష్కరణలో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

ఓజిలి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదన్నర కాలంలో రైతులను విస్మరించిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీన ర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఓజిలి మండల నాయకులతో కలసి అన్నదాత పోరు పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు.

కోట: అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన నాయకులతో కలిసి సోమవారం విద్యానగర్‌లో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు.

గూడూరురూరల్ : కోర్టు సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో నాయకులతో కలసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు.

తడ: మండల కేంద్రంలోని పున్నమి అతిథి గృహంలో అన్నదాత పోరు పోస్టర్లను పార్టీ మండల కన్వీనర్ కే ఆర్ముగం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.



ఓజిలి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



తడ: అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు



కోట: పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే కిలివేటి నివాళి



సుధాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి, నాయకులు

దొరవారిసత్రం: అక్కరపాక మాజీ సర్పంచ్ సన్నారెడ్డి సుధాకర్‌రెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన సోమవారం ఎస్ఎం అగ్రహారంలో సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం మెండు



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం పద్మమ్మ

ఓజిలి: రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఏపీఎం పద్మమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై సోమవారం ఆమె అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వినియోగించకుండా పశువుల పేడ, ఆవు మూత్రం, ప్రకృతిలో లభించే ఆకులతో తయారు చేసిన కషాయాలను వినియోగించి కూరగాయాలు సాగుచేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తక్కువ ఖర్చు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంటీ తిరుమల, ఓజిలి ఇన్‌చార్జ్ జైతున్‌బీ, సిబ్బంది చెంచమ్మ, రేవతి, గురవయ్య, షబ్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలి



ప్రిన్సిపల్ కృష్ణవేణిని సన్మానిస్తున్న ఎంపీడీఓ భవాని

రాపూరు: విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎంపీడీఓ భవాని సూచించారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపల్ కృష్ణవేణిని ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన అక్షరం



అక్షర రూపంలో అలరించిన విద్యార్థులు

చిల్లకూరు : అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సామూహికంగా అక్షరం ఆకారంలో కూర్చుని అలరించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. భారతీయ శిక్షణ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రజేంద్రరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు క్రీడా మైదానంలో అక్షరం అనే పదంలా కూర్చుని అలరించారు. ప్రజేంద్రరెడ్డి మాట్లాడుతూ యునెస్కో వారు చదువు ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 8న అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం అనసూయ, జీ మాధవయ్య, బీ కామేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఓజిలి మండలం పాపిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన మైలారి వినోద్ జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బైక్‌పై మేనకూరు నుంచి వారి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో చలివేంద్రం గ్రామ సమీపంలో మేనకూరు వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వినోద్‌ను వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొలాలకు దారేది?

నాయుడుపేట టౌన్ : మండలంలోని జువ్వలపాళెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు, పలువురి పొలాలకు 71వ జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా దారి వసతి లేకుండా చేస్తున్నారని సోమవారం జువ్వలపాళెం సర్పంచ్ తొప్పని రమణయ్య ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం అందించారు. జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా పంట కాలువలు పూడ్చివేసి, జువ్వలపాళెం, మందబైలు, కారుమంచివారి కండ్రిగ, తదితర గ్రామాలకు దారి లేకుండా చేశారని విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్‌తోపాటు నాయకులు నరసింహులు నాయుడు, అత్తికాయల నటరాజు, షేక్ సుల్తాన్ తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపిస్టుకు సన్మానం



సత్కరిస్తున్న మహిళలు, సంఘ పెద్దలు

నాయుడుపేటటౌన్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఫిజియోథెరపిస్ట్ విజయమేరిని సన్మానించారు. గడియారం సెంటర్ వద్ద ఉన్న ఆమె ఆస్పత్రిలోనే డాక్టర్‌ను పలువురు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. డాక్టర్ విజయ మేరి మాట్లాడుతూ చాల మంది వ్యాయమం చేయక వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనేక వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీసెస్ గ్రేస్ చర్చి వ్యవస్థాపకురాలు వసంతకుమారి, ఫాస్టర్ ప్రేమ్‌కుమార్, గురుకుల ప్రిన్సిపల్ సుబ్బారావు, బందిలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో పోలేరమ్మతల్లి జాతర

వెంకటగిరి(సైదాపురం): పోలేరమ్మతల్లి జాతర ప్రతిష్టాత్మకంగా పోలీసు నిఘా నీడలో నిర్వహించనున్నట్లు వెంకటగిరి సీఐ ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నరసింహారావు అధ్యక్షతన సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ ఏవీ రమణ మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక క్రైమ్ పార్టీ 8 టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్యూలో మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసులు అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేసేందుకు శక్తివందంగా కృషిచేయనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకుంటూ సంప్రదాయబద్ధంగా జాతర నిర్వహణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ, తహసీల్దార్ నరసింహారావు

ఈవోకు వినతి

వెంకటగిరి (సైదాపురం): రాష్ట్ర పండుగ హోదా పొందిన వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరలో మున్సిపాలిటీలోని కౌన్సిలర్లను భాగస్వాములను చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య కోరారు. స్థానిక దేవదాయశాఖ కార్యాలయంలో ఈఓ వెంకట శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రం సోమవారం అందజేశారు.

డీబీహెచ్‌పీ హాల్‌టికెట్ల పంపిణీ

కలువాయి(సైదాపురం): మండలంలోని చీపినాపి జెడ్పీహైస్కూల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ (డీబీహెచ్‌పీ) నిర్వహించే పరీక్షలకు 61 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఏటా సెప్టెంబర్, ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం జనార్దన్ తెలిపారు. ఇతర వివరాలకు 94931 69758ను సంప్రదించవచ్చని చెప్పారు.

నానో ఎరువులపై అవగాహన

వాకాడు: మండలంలోని నెల్లిపూడి రైతు సేవా కేంద్రంలో సోమవారం నానో ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ దీప మాట్లాడుతూ రైతులు మొదటి దశలో ఘన రూప యూరియా వేసుకుని, తదుపరి దశలో నానో యూరియాను వేసుకోవాలన్నారు. దీని వల్ల రైతులకు సాగులో ఖర్చులు తగ్గుతాయన్నారు. జీవన ఎరువులు వాడడం వలన గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అడవి నుంచి కలప మాయం



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిపోతున్న కలప

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో ఫారెస్టు భూముల్లో కలప మాయవుతోంది. ఫారెస్టు అధికారులు కలువాయిలో ఒక దళారితో కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మండలంలోని అటవీ భూముల్లో జామాయిల్, వేప, టేకు వంటి కలప విరివిగా ఉంది. అయితే కొందరు దళారులు ఫారెస్టు అధికారులతో చేతులు కలిపి కలపను తరలించుకుపోతున్నారు. తెలుగు గంగ కాలువ పక్కన ఉన్న ఫారెస్టులో జామాయిల్ చెట్లు, తోపుగుంట, బాలాజీరావుపేట, వెంకటరెడ్డిపల్లి, ఉయ్యాలపల్లి, మాదన్నగారిపల్లి, ఎర్రబల్లి, తదితర గ్రామాల్లోని అటవీ భూముల్లో జామాయిల్, వేప, టేకు చెట్లు ఏపుగా పెరిగాయి. ఫారెస్టు బీట్ ఆఫీసర్ల జేబులు నింపేసి ఈ చెట్లను నరికి కలప తరలించేస్తున్నారు. మాదన్నగారిపల్లి అడవిలో నుంచి ట్రాక్టర్‌లో జామాయిల్ అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే అటవీ అధికారులు జరిమానా వేసి వదిలేయడం గమనార్హం.

మెడికల్ కళాశాలల ధారాదత్తం అన్యాయం

పెళ్లకూరు: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జగనన్న పాలనలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు దారాదత్తం చేయడం అన్యాయమంటూ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పుల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. సింగపూర్‌కు చెందిన బినామి కంపెనీలకు మెడికల్ కళాశాలలు అప్పగించడం మంచిది కాదన్నారు. తద్వారా పేదలు వైద్య విద్యను అభ్యసించే అవకాశం కోల్పోతారని వెల్లడించారు. 1923లో ఆంధ్రావిశ్వవిద్యాలయంలో తొలిసారి మెడికల్ కళాశాలను స్థాపించినప్పటి నుండి 102 ఏళ్లుగా ఒక్క మెడికల్ కాలేజ్‌ను కూడా రాష్ట్రానికి తీసుకురాలేదన్నారు. కూటమి అక్రమాలపై ప్రశ్నిస్తున్న మీడియా సోదరులపైన, వైఎస్సార్ సీపీ నాయకుల పైనా అక్రమ కేసులు పెట్టడం తగదన్నారు. ఆయన వెంట వెంకటేష్‌రెడ్డి, మణినాయుడు, రమణయ్య, శంకరయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

11 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

గూడూరురూరల్ : గూడూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 11, 12, 15 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఉప విద్యాశాఖాధికారి సనత్‌కుమార్ తెలిపారు. ఆ పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ భాస్కర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సనత్‌కుమార్ మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాల బాలికలకు సంబంధించి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. మండల స్థాయి అనంతరం డివిజనల్, జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ఉప విద్యాశాఖాధికారి సనత్‌కుమార్

మహిళలకు చీరల పంపిణీ

వెంకటగిరి రూరల్: విశ్వోదయ కళాశాల వ్యవస్థాపకులు జేవీ నరసింహారావు జయంతి సందర్భంగా పట్టణంలోని తిరువీధుల కాంప్లెక్స్‌లోని జేవీఎన్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు లక్కమనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్కమనేని మురళీకృష్ణ, శిరసనగండ్ల గంగాప్రసాద్, పునుగోటి కోటి రాధాకృష్ణ, జూపల్లి రాజ్యలక్ష్మి, సుంకర రవికుమార్, రాదాకృష్ణయ్య పాల్గొన్నారు.



మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఎరువుల కొరతపై సీపీఐ నిరసన

చిల్లకూరు: రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించలేకపోతోందని సోమవారం మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం మాత్రం రైతులకు అవసరమైనంత మేర యూరియా సరఫరా చేయలేకపోతోందన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వంలోని పెద్దలు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శశికుమార్, నారాయణ, రమేష్, గోపాల్, సునీల్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకుల

జీలుగ విత్తనాల కోసం రైతుల ప్రదక్షిణలు

కోట: జీలుగ విత్తనాల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని మండలంలోని రుద్రవరం రైతులు వాపోయారు. ఊనుగుంటపాళెం రైతు సేవా కేంద్రం పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము కోసం రైతులు అల్లాడుతున్నారు. రైతు సేవా కేంద్రానికి సుమారు మూడు టన్నుల మేర జీలుగ విత్తనాలు వచ్చినట్లు తెలియడంతో రుద్రవరం రైతులు వెళ్లారు. వచ్చిన వెంటనే విత్తనాలు అయిపోయినట్లు అధికారులు చెప్పడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గ్రామంలో 50 మంది వరకు రైతులు ఉన్నా ఒక్కరికి కూడ రైతు సేవా కేంద్రం ద్వారా జీలుగలు అందలేదన్నారు. దీంతో తహసీల్దార్ జయజయరావును కలసి రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఏఓ సుచేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా జీలుగ విత్తనాల కొరత ఉందన్నారు.


పోస్టల్ బీమా పత్రాల అందజేత

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెంలో పట్టాభి రామాలయంలో సోమవారం పేద కుటుంబాలకు దాతల సహకారంతో పోస్టల్ బీమా చేయించి పత్రాలు అందజేశారు. సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కొడవలూరు రాధాకృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు సాయి కృష్ణా ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు పుట్టంరెడ్డి వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల సహకారంతో 16 పేద కుటుంబాలకు సొంత నిధులతో పోస్టల్ బీమా చేయించి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు దామోదర్‌రెడ్డి, దీవి అనంతాచార్యులు, అల్లం రమణయ్య, నరేష్, హేమంత్, శేషాద్రి, సాయిబాబు పాల్గొన్నారు.



పోస్టల్ బీమా పత్రాలు అందజేస్తున్న దాతలు

దివ్యాంగ పిల్లలకు వైద్య పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గౌరీశంకర్ రావు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శారీరక, మానసిక వైకల్యం ఉన్న సుమారు 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలియజేశారు. ఏపీసీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన దివ్యాంగులందరూ ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆగని డంపింగ్ యార్డు వివాదం

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కొన్నేంబట్టు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పురపాలక డంపింగ్‌యార్డు వివాదం కొనసాగుతోంది. మరోసారి మున్సిపాలిటీ అధికారులు చెత్త ట్రాక్టర్లతో కేటాయించిన స్థలం వద్ద వెళుతుండగా కొన్నేంబట్టు గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించడంతో ఎస్ఐ బ్రహ్మనాయుడు, సీఐ మురళీ కృష్ణ, పోలీసులతో అక్కడికి చేరుకుని గ్రామస్తులు సమస్యలుంటే ఆర్డీఓ, కలెక్టర్ వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని రోడ్డు రాకపోకలకు ఇబ్బందులు గురిచేయకూడదని సర్ది చెప్పారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు రెండు రోజులు సమయం కేటాయించాలని కోరారు.

నేత్రపర్వం.. రథోత్సవం!



రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు, మల్లాం పుర వీధుల్లో భక్త జన సందోహం మధ్య రథోత్సవం

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. మల్లాసుర కొల్లాసుర రాక్షసులను లోక కల్యాణార్థం స్వామివారు సంహరించిన అనంతరం విజయోత్సవానికి చిహ్నంగా స్వామి అమ్మవార్లను రథంపై కొలువుదీర్చి గ్రామవీధుల్లో ఊరేగారు. దీంతో మల్లాం గ్రామం భక్తులతో కిక్కిరిసిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నామస్మరణతో మారుమోగింది. యువతీ యువకులు రథాన్ని లాగి తమకు కల్యాణప్రాప్తి ప్రసాదించాలని కోరుకున్నారు. అనారోగ్యంతో బాధపడేవారు స్వామి వారి తేరుపై మిరియాలు, ఉప్పు చల్లి తమ రుగ్మతలు తొలగిపోవాలని స్వామి వారిని వేడుకున్నారు. శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో రథంపై ఆశీనులై కనువిందుచేశారు. రథం గ్రామంలో తమ ఇంటిముందుకు రాగానే గ్రామస్తులు కొబ్బరి కాయలు సమర్పించారు. దీనికి ఆలయ మాజీ చైర్మన్‌లు చిల్లకూరు వేణురెడ్డి కుమారుడు చిల్లకూరు కోదండరామిరెడ్డి, శారదమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి కూచిపూడి భరతనాట్యం ప్రదర్శించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం షణ్ముఖస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

భక్తులకు అన్నదానం

రథోత్సవానికి పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. దీనికి వైఎస్సార్ సీపీ నేత షణ్ముఖ ఆక్వానీడ్స్ అధినేత కాపులూరు బాలాజీ కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేశారు. దీన్ని వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు శేషురెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ చిల్లకూరు సాయి కుమార్ రెడ్డి, దయాకర్ రెడ్డి పర్యవేక్షించారు.



ఆకట్టుకున్న నందిసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నందిసేవ సోమవారం తెల్లవారు జామున నిర్వహించారు. నందివాహనంపై ఈశ్వరుడు, నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఊరేగారు. ప్రత్యేక పూల అలంకరణతో నందిసేవను అత్యంత కమనీయంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం స్వామివారు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మల్లాం లో స్వయంభువుగా ఉద్భవించి రాక్షసులను సంహరిస్తాడు. ఈ విజయానికి సూచికగా సోమవారం ఉదయం రథోత్సవం నిర్వహించారు.

చికెన్ ధరలు 09-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	127
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	230
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	252
లేయర్ చికెన్	:	210